నూతన కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 5: మహేంద్ర సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పిల్లి మధు, పిల్లి రవి, ఉపాధ్యక్షుడిగా రేషం నరేశ్, కోశాధికారిగా పిల్లి నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడ తుమల్ల లక్ష్మీనర్సయ్య, తుమ్మల రామకృష్ణ, పిల్లి శంకరయ్య, ఇందూరి దేవయ్య, ఇందూరి బాలకిషన్, పిల్లి సుధాకర్, పిల్లి వేణు, ఇందూరి రాములు, నర్సింలు, పోతు లింబయ్య, నర్సయ్య ఉన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న వెలమ సంక్షేమ మండలి జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు

సిరిసిల్ల టౌన్, జనవరి 5: జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువతులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో ఎంపిక చేసిన వారికి జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు బహుమతులను ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. ఇక్కడ జిల్లా వెలమ సంక్షేమ మండలి ప్రధాన కార్యదర్శి గుజ్జనేని వేణుగోపాల్‌రావు, అయిలినేని పాపారావు, సురభి దశరథ్‌రావు, చెన్నమనేని కమలాకర్‌రావు, నాయిని కిరణ్‌రావు, కల్వకుంట్ల నాగేశ్వర్‌రావు, కారంగుల వెంకట్‌రావు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

పోచెట్టిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

వేములవాడ రూరల్, జనవరి 5 : వేములవాడ రూరల్ మండలం పోచెట్టిపల్లి గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు మాట్లాడుతూ, రైతుల పక్షాన పనిచేస్తానని, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో రైతులకు అండగా ఉంటూ అభివృద్ధిలో ముందుంటామన్నారు. పోచెట్టిపల్లి గ్రామస్తులతోపాటు మున్నూరుకాపు సంఘం నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్నురుకాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు..

నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లను సన్మానిస్తున్న మండల పద్మశాలీ సంఘం నాయకులు

చందుర్తి, జనవరి 5: రుద్రంగి మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియామకమైన నాగుల శంకర్ గౌడ్, మర్రికృష్ణను చందుర్తి మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం చందుర్తి గ్రామాధ్యక్షుడు చిలుక దేవరాజం, ఆడెపు అంజయ్య, నల్ల లక్ష్మణ్, సుంకి జలందర్, చిలుక రాంప్రసాద్, చిలుక శ్రీనివాసు, అడ్డగట్ల శంకర్, నడిగడ్డ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

సిరిసిల్ల రూరల్, జనవరి 5 : ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామానికి చెందిన కొమరవెల్లి శ్రీనివాస్ (49) కూలీ పనిచేసుకుని జీవిస్తున్నాడన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం సొంత స్థలంలో అప్పు తెచ్చి రేకుల షెడ్డు కట్టుకున్నాడు. కుటుంబ పోషణకు, సరైన ఉపాధి దొరకకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని పేర్కొన్నారు. దీంతో పలుమార్లు ఆత్మహత్యాయత్నాలు చేశాడన్నారు. 15 రోజులుగా ఎలాంటి పనిదొరకడం లేదని ఇంట్లో చెప్పుకుంటూ బాధపడుతూ ఉండేవాడన్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం కూలి పనికోసం సిరిసిల్ల వెళ్లాడని, అక్కడ పని దొరకకపోవడంతో మనస్తాపం చెంది తాడూరి గ్రామ పంచాయతీ వద్ద ఉన్న సెల్ టవర్ ఎక్కి తాడుతో ఉరివేసుకున్నాడు. శ్రీనివాస్ భార్య కొమరవెల్లి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

ఇల్లంతకుంట, జనవరి 5 : ఇల్లంతకుంట మండలం ఆరెపల్లి గ్రామంలో నూతనంగా రెడ్డి సంఘాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం కొండల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా చింతంపల్లి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తీపిరెడ్డి తిరుపతి రెడ్డి, కోశాధికారిగా పవన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

కలెక్టరేట్, జనవరి 5: జిల్లాలోని మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. ఈ మేరకు ఆదివారం సిరిసిల్ల సుభాష్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్మిక భవన్‌లో ప్రధాన కార్యదర్శి కడారి రాములు జిల్లాలోని మిషన్ భగీరథ కార్మిక సమస్యలపై మాట్లాడారు. జిల్లాలో మిషన్ భగీరథ కార్మికులకు రూ.9,500 ఇస్తున్నారని అన్నారు. గత 2018 సంవత్సరం నుంచి గత సంవత్సరం సెప్టెంబర్ వరకు పీఎఫ్ డబ్బులని చెప్పి కట్‌చేసి ఇప్పటివరకు సుమారుగా రూ.35 వేలు నేటికీ కూడా అడిగినా చెల్లించడం లేదని మండిపడ్డారు. పైగా పని భద్రత లేదని, అంతే కాకుండా తొమ్మిది నెలలుగా వేతనాలు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల నేరుగా వీరికి ప్రభుత్వమే జీతాలు చెల్లించి ఒకటో తేదీనే వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ముఖ్య అధికారులు, కాంగ్రెస్ పెద్దలు ఈ విషయమై సత్వరమే ఆలోచన చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వీరి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు కడారి రాములు, అజ్జ వేణు

12 నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

వేములవాడ రూరల్, జనవరి 5 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామంలో ఈనెల 12 నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సంఘస్వామియాదవ్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నామని, ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇల్లంతకుంట రూరల్, జనవరి 5 : మండలంలోని దాచారం గ్రామానికి చెందిన యువకుడు బత్తిని సాగర్(21) గజ్వేల్‌లో వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సాగర్ గజ్వేల్‌లో ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తుండేవాడు. సాగర్‌కు తల్లిదండ్రులు బత్తిని లింగయ్య, రజిత, సోదరుడు సాయిప్రసాద్ ఉన్నారు. బతుకు దెరువు కోసం గజ్వేల్ వెళ్లి తమ కొడుకు విగత జీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

గీత కార్మికుల పరస్పర ఫిర్యాదు

ముస్తాబాద్, జనవరి 5 : మండలంలోని పోతుగల్ గ్రామంలో గీత కార్మికులు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు దూషణకు దిగారు. అనంతరం రెండు వర్గాల వారు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. గతంలో ఎవరికి వారే కల్లుగీసి విక్రయించే వారు. నూతనంగా సంఘం ఎన్నిక జరుగగా రెండు గ్రూపులుగా ఏర్పడడంతో సమస్య వచ్చిందని దీనిపై కొందరు స్టేషన్‌కు రావడంతో మరో వర్గం కూడ స్టేషన్‌కు వెళ్లినట్లు కార్మికులు తెలిపారు.

జాతీయస్థాయి సైన్స్‌లో దమ్మన్నపేట విద్యార్థిని ప్రదర్శన

గంభీరావుపేట, జనవరి 5: మండలంలోని దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని వినీల ఆదివారం జాతీయస్థాయి చిల్డ్రన్స్ సైన్స్ ప్రదర్శనలో పాల్గొన్నారని హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ప్రదర్శనలో రాష్ట్రం నుంచి 13 మంది విద్యార్థుల్లో ఒకరుగా పాఠశాల నుంచి వినీల ఎంపికై మహిళలకు రుతు బంధన్ అనే అంశంపై ప్రదర్శించారని హెచ్ఎం తెలిపారు.

ప్లీడర్‌కు సన్మానం

వేములవాడ రూరల్, జనవరి 5 : వేములవాడ రూరల్ మండలం వెంకటాంపల్లి గ్రామంలో మాదిగ కుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నియామకమైన సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బొడ్డు ప్రశాంత్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకుల ప్రభాకర్, నాగరాజు, దేవయ్య, వెంకటేశ్, అనిల్, కాంగ్రెస్ నాయకుడు బండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

హుజూరాబాద్ టౌన్, జనవరి 5: హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామ శివారులోని జూపాక క్రాస్ రోడ్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాజుల ఓదమ్మ(68) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన ప్రకారం వివరాలు... శంకరపట్నం మండలం కల్వల గ్రామానికి చెందిన ఓదమ్మ, శనివారం జూపాక గ్రామంలో తన బంధువులు మృతి చెందగా అంత్యక్రియలకు వెళ్లి, తిరిగి ఇంటికి బయలుదేరింది. జమ్మికుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై జూపాక క్రాస్ రోడ్ వద్ద నిల్చొని ఉండగా జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు వేగంగా వస్తున్న కారు(ఏపీ 20 క్యూ7299) ఢీకొన్నది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను 108లో హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్ సలహా మేరకు అక్కడి నుంచి ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఓదమ్మ మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ఖాజా కలీముల్లాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- అడవిపదిరలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

వీర్నపల్లి, జనవరి 5: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అడవిపదిరలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఒక మతానికి, కులానికి సంబంధించిన వ్యక్తి కాదన్నారు. ఈతరం అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలన్నారు. అనంతరం కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన పోరాటం మనందరికీ స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. అరుణోదయ కళాబృందం సభ్యులు, గజ్జెల అశోక్ కళాబృందం సభ్యుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎడ్ల సాగర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్లు మాడ్గుల మల్లేశం, వర్స కృష్ణహరి, అరుణోదయ సాంస్కృతిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క, నేతలు కుంబాల మల్లారెడ్డి, బోయిని రవి, భాస్కర్, తిరుపతిరెడ్డి, దేవరాజు,అరుణ్‌కుమార్, ప్రశాంత్, బాబు, తిరుపతిలున్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

ఇసుక డంపుల సీజ్

ఇసుక డంపులను సీజ్ చేస్తున్న పోలీసులు

చందుర్తి, జనవరి 5 : మండలంలోని కట్టలింగంపేట గ్రామ శివారులో అక్రమంగా ఏడు చోట్ల నిల్వ ఉంచిన దాదాపు 40 ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుక డంపులను చందుర్తి ఎస్ఐ అంజయ్య ఆధ్వర్యంలో ఆదివారం పట్టుకొని సీజ్ చేశారు. అనంతరం పంచనామా కోసం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఇసుక డంపులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. మోత్కుపల్లి జలందర్, ఈసారి శ్రీనివాస్‌కు, మోత్కుపల్లి దేవయ్యలు ఇసుకను డంపు చేసినట్లు గుర్తించాన్నారు. పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బందినికి ఇసుక డంపులు ఎవరూ కూడా తరలించకుండా కాపలా ఉండాలని సూచించినట్లు తెలిపారు. ఎస్ఐ అంజయ్య మాట్లాడుతూ, అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధిత కుటుంబానికి మిత్రుల చేయూత



బాధిత కుటుంబానికి బ్యాంకులో ఫిక్స్ చేసిన చెక్కు అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

ముస్తాబాద్, జనవరి 5 : మిత్రుడు అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబ పరిస్థితి తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు తలా కొంత పోగుచేసి రూ.20 వేల సాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన పర్స రాజు (35) అనారోగ్యంతో 15 రోజుల క్రితం మరణించాడు. రాజుకు భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు సుదీక్షణ (6) శ్రీయాన్ష్ (3) ఉన్నారు. పేద కుటుంబం కావడంతో మిత్రులందరూ కలిసి ముస్తాబాద్ సహకార సంఘంలో రూ.20 వేలను ఫిక్స్ డిపాజిట్ చేసి బాధిత కుటుంబానికి ఆదివారం చెక్కు అందించారు. శీలం స్వామి, చింతోజు అమర్, వట్టెల రమేశ్, సందుపట్ల శ్రీనివాస్, మాచర్ల శేఖర్, మిడిదొడ్డి బాలయ్య, అనమేని నర్సింలు, ఎస్కె దస్తగిరి,కొమ్మాట సాయిప్రసాద్ అందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి

తెలంగాణ చౌక్, జనవరి 5: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాబోయే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వచ్చే ఏడాది విద్యార్థుల నమోదును పెంచాలని, నాణ్యమైన విద్యను అందించాలని పేర్కొన్నారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, జక్కని నవీన్, మహేశ్, శంకర్ తదితరలున్నారు.

ఎల్ ఎల్ బీ పరీక్షల వాయిదా

కమాన్‌చౌరస్తా, జనవరి 5 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బీ ఫిఫ్త్ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 6 నుంచి నిర్వహించాల్సి ఉండగా, వాటిని టెట్ కారణంగా వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 20 వరకు టెట్ కొనసాగనుండగా, ఎల్ఎల్‌బీ ఐదో సెమిస్టర్ పరీక్షలు 20వ తేదీ తర్వాత నిర్వహించాలని పలువురు వీసీకి విన్నవించిన నేపథ్యంలో పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో శాతవాహన యూనివర్సిటీ వీసీకి ఎల్ఎల్‌బీ విద్యార్థి సంఘం నాయకుడు సముద్రాల రాజేందర్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

9న ఎమ్మార్పీస్ మండల కమిటీ ఎన్నిక

బోయినపల్లి, జనవరి 5: బోయినపల్లి మండల కేంద్రంలో ఈ 9న ఎమ్మార్పీస్ మండల కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్ మాదిగ తెలిపారు. బోయినపల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో వర్గీకరణ అమలుకు, 'వెయ్యి గొంతులు-లక్ష డప్పుల'తో మహా ప్రదర్శన విజయవంతం చేసేందుకు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నిర్మాణ కమిటీల్లో భాగంగా ఈనెల 9న (గురువారం) మండల కేంద్రంలో బోయినపల్లి మండల కమిటీ ఎన్నుకుంటారని తెలిపారు. అన్ని గ్రామాల మాదిగ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు, రాజకీయ పార్టీలకతీతంగా నూతన కమిటీ ఏర్పాటు సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ బోయినిపల్లి మండల ఇన్‌చార్జి, రాష్ట్ర నాయకులు గుండ్రెడ్డి రాజు మాదిగ, జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేశ్ మాదిగ, మండల నాయకులు మల్లారపు చందు మాదిగ, పెగ్గర్ల శేఖర్ మాదిగ, అలువాల అంజయ్య మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రిమాండ్

వేములవాడ, జనవరి 5 : వేములవాడ పట్టణానికి చెందిన సయ్యద్ యాకుబ్‌బీ భర్త హైదర్‌పై పెట్టిన కేసులో ఆమెకు సహాయం చేస్తానని నమ్మించి మోసగించిన కేసులో మంగళపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం, కోనరావుపేట మండలం మంగళపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ఉప్పుల శ్రీనివాస్, వేములవాడ పట్టణానికి చెందిన సయ్యద్ యాకుబ్ బీ, భర్త హైదర్ పెట్టిన కేసులో సహకారం అందిస్తామన్నాడన్నారు. ఎఫ్ఐఆర్ కాగితాలు తీసుకొని తనతో తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకోవడంతోపాటు కోర్టుకు డబ్బులివ్వాలని బెదిరించి రూ.30 వేలు తీసుకున్నాడని, భర్తతో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని, లైంగిక వాంఛ తీర్చాలని వేధించాడని యాకుబ్‌బీ ఫిర్యాదు చేయగా శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామన్నారు. విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించామనీ సీఐ పేర్కొన్నారు.

వృద్ధులకు చీరెలు పంపిణీ

ముస్తాబాద్, జనవరి 5 : గూడెం గ్రామంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు ఆదివారం చీరెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేశ్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన గూడూరి

కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల టౌన్, జనవరి 5: టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నిరసనకు తరలిరండి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు

ముస్తాబాద్, జనవరి 5 : రైతు భరోసాపై మాట మార్చిన కాంగ్రెస్ తీరును నిరసిస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పిలుపుమేరకు సోమవారం నిర్వహించే నిరసన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోని వచ్చిన వెంటనే రైతులందరికీ రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పి సంవత్సరం గడిచిన తరువాత క్యాబినెట్ మీటింగ్‌లో రూ.12 వేలలు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది కాంగ్రెస్ కుటీల బుద్ధికి నిదర్శనమన్నారు. అందుకు నిరసనగా రైతులకు ఇచ్చిన విధంగా ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా ఇవ్వాలని రైతుకు మద్దతుగా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ తల్లి విగ్రహం ముందు నిరసన కార్యక్రమం ఉంటుందని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

తెలంగాణ చౌక్, జనవరి 5: జిల్లాలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా విక్రయించినా, వినియోగించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం ప్రకటనలో హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో యువత గాలిపటాలు ఎగురవేయడానికి వినియోగించే నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే చైనా మాంజాలను వినియోగించవద్దని పేర్కొన్నారు. వీటిద్వారా మనుషులతో పాటుగా ఎగిరే పక్షలకు ప్రమాదకరమని, పర్యవరణానికి విపత్తుగా మారుతున్న నేపథ్యంలో జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లాలో ఎక్కడైనా చైనా మాంజాలు క్రయవిక్రాయాలు, వినియోగం జరిగితే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

'ఇంటి నిర్మాణం చేసుకోనివ్వడం లేదు'

ఎల్లారెడ్డిపేట, జనవరి 5: తనకు అన్ని రకాల అనుమతులున్నా అధికారులు పనులను అడ్డుకుంటున్నారని మండల కేంద్రానికి చెందిన శ్రీరామోజు ప్రేమల ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కేంద్రంలో హనుమాన్ టెంపుల్ పక్కన ఆమె విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో హనుమాన్ టెంపుల్ పక్కన ఉన్న తన స్థలంలో 2021లోనే ఇంటి పర్మిషన్ తీసుకోగా కొందరు తమ సంఘం స్థలముందంటూ అభ్యంతరం వ్యక్తం చేయగా తాము కలెక్టర్‌ను ఆశ్రయించామని అన్నారు. కలెక్టర్ అన్ని రకాల వివరాలు సేకరించిన తర్వాత కట్టుకునేందుకు అనుమతించిప్పటికీ పంచాయతీ అధికారులు అనుమతించడం లేదని ఆరోపించారు. దీనిపై ఎంపీవో జోగం రాజును వివరణ కోరగా ఎంఆర్‌వో కార్యాలయం నుంచి తుది అనుమతులు లభించనందున నిర్మాణ పనులకు అభ్యంతరం తెలిపిన సంఘ సభ్యులు గత నెల 31న ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారన్నారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేయగా తహసీల్దార్ కార్యాలయం నుంచి తుది అనుమతి లభించలేదని అందుకే పనులు నిలిపివేయించామని పేర్కొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధిపై కమిషనర్‌తో ప్రభుత్వ విప్ చర్చ

వేములవాడ టౌన్, జనవరి 5 : రాజన్న దర్శనార్థం వచ్చిన దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలిసి ఆలయ అభివృద్ధిపై చర్చించారు. వచ్చే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కమిషనర్‌కు సూచించారు. ఆలయ అభివృద్ధిపై పలు అంశాలపై హైదరాబాద్‌లో వీటీడీఏ సమావేశంలో చర్చించామని అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ శ్రీధర్ తెలిపారు. ఇక్కడ ఆలయ అధికారులున్నారు.